# చమురు మార్కెట్‌లో ఎర్ర కల్లోలం

## హౌతీలపై అమెరికా, బ్రిటన్ ప్రతీకార దాడులు

### రెడ్ సీలో ఆయిల్ రవాణాకు ఆటంకం

### 3 శాతం ఎగబాకిన ధరలు






న్యూఢిల్లీ, జనవరి 12: ఎర్ర సముద్రంలో నెలకొన్న పరిస్థితులు.. అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో కల్లోలం రేపుతున్నాయి. యెమన్‌లో హౌతీ తిరుగుబాటుదారులకు చెందిన డజనుకుపైగా స్థావరాలపై అమెరికా, బ్రిటన్ సైన్యం ప్రతీకార దాడులకు దిగింది. అటు ఆకాశం నుంచి, ఇటు సముద్ర జలాలపై నుంచి అగ్ర రాజ్యాల దాడులు జరుగుతున్నాయి. దీనికి మరికొన్ని దేశాల మద్దతు కూడా ఉన్నది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజే చమురు ధరలు 3 శాతం మేర పెరిగాయి. గాజా విషయంలో ఇజ్రాయెల్ తీరును నిరసిస్తూ ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ రెబల్స్ దాదాపు రెండు నెలలుగా దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. ఇది ఇజ్రాయెల్‌తో పాటు ఆసియా, ఐరోపా వర్తక, వాణిజ్యాన్నే దెబ్బతీస్తున్నది. ముఖ్యంగా ఆ దారి గుండా జరుగుతున్న చమురు రవాణాపై ప్రభావం పడుతున్నది. ఇప్పటికే ట్యాంకర్లు ఆ మార్గాన్ని కాదని దూరం ఎక్కువైనా వేరే మార్గాన్ని ఎంచుకున్నారు. తాజాగా అమెరికా, బ్రిటన్ల జోక్యంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. దీంతో ఎర్ర సముద్రం మీదుగా అరకొరగా నడిచే నౌకలు కూడా ఆగిపోవాల్సి వస్తున్నది. ఫలితంగా రవాణా, ఇతరత్రా ఖర్చులు పెరిగిపోగా, సహజంగానే అది చమురు ధరల్ని ఎగదోస్తున్నది. అందులో భాగంగానే బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్‌లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 2.21 డాలర్లు లేదా 2.9 శాతం పెరిగి 79.62 డాలర్లకు చేరింది. అమెరికా, వెస్ట్ టెక్సాస్ అంతర్జాతీయ క్రూడ్ ఫ్యూచర్స్‌లో సైతం 2.13 డాలర్లు లేదా 3 శాతం ఎగిసి 74.15 డాలర్లు పలికింది.

**అంతా గమనిస్తున్నాం**

తాజా పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నామని సౌదీ అరేబియా అన్నది. చమురు ఎగుమతిదారుల్లో సౌదీ టాప్ అన్న సంగతి విదితమే. భారత్‌కూ పెద్ద ఎత్తున ఇది క్రూడ్‌ను ఎగుమతి చేస్తున్నది. పరిస్థితులు ఎలా ఉన్నా.. ఇప్పటిదాకా సౌదీ ధరల్ని పెంచలేదు. అందుకే భారత్‌కూ పెద్దగా ఇబ్బంది రాలేదు. అయితే గ్లోబల్ మార్కెట్‌లో పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా పెంచాలన్న ఒత్తిడి ఒపెక్ దేశాల నుంచి సౌదీపై వస్తే.. ఆ ప్రభావం భారతీయ మార్కెట్‌పై తప్పక ఉంటుందన్న అభిప్రాయాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. అగ్ర రాజ్యాల జోక్యం ఈ వ్యవహారాన్ని ప్రపంచవ్యాప్తం చేసిందన్న వాదనలూ వ్యక్తమవుతున్నాయి.



**భారత్‌పై ప్రభావం**

రెడ్ సీలో సంక్షోభం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశీయ ఎగుమతుల్ని గత ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే 6.7 శాతం మేర తగ్గించవచ్చన్న అంచనాలున్నాయి. 2022-23లో భారత్ నుంచి 451 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. అయితే ఈసారి 421 బిలియన్ డాలర్లకే పరిమితం కావచ్చని రిసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్ఐఎస్) చెప్తున్నది. దీంతో 30 బిలియన్ డాలర్ల (రూ.2.50 లక్షల కోట్లు) వరకు పడిపోవచ్చని తెలుస్తున్నది. ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌకలకు హౌతీ మిలిటెంట్ల నుంచి ప్రమాదం పొంచి ఉండటంతో కంటైనర్ షిప్పింగ్ రేట్లు అమాంతం పెరిగాయి. అంతేగాక ప్రయాణ ఖర్చులు, కంటైనర్లలోని సరకులకు సంబంధించిన బీమా ప్రీమియంలూ భారంగా తయారయ్యాయి. దీంతో ఎగుమతిదారులు వెనుకడుగు వేస్తున్నట్టు ఆర్ఐఎస్ డైరెక్టర్ సచిన్ చతుర్వేది చెప్తున్నారు. ఇప్పటికే భారతీయ ఎగుమతిదారులు 25 శాతం ఎగుమతుల్ని ఆపేసినట్టు దేశీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ తెలిపారు. ఇక గత నెల ప్రథమార్ధంతో పోల్చితే ఇప్పుడు ఎర్ర సముద్రం మీదుగా వెళ్లే నౌకలు దాదాపు 44 శాతం తగ్గాయని ప్రపంచంలోనే అతిపెద్ద షిప్ బ్రోకర్ క్లార్క్‌సన్ రిసెర్చ్ గుర్తుచేస్తున్నది. సరకు రవాణా సామర్థ్యం కూడా 40 లక్షల టన్నుల నుంచి 25 లక్షల టన్నులకు తగ్గిందంటున్నది.

**అసలేం జరుగుతోంది?**

గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను వ్యతిరేకిస్తూ ఎర్ర సముద్రంలో నౌకలపై హౌతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడుతున్నారు. వీరికి ఇరాన్ మద్దతున్నది. ఆసియా, ఐరోపా దేశాల మధ్య వర్తక, వాణిజ్యానికి వీలుగా హిందూ మహాసముద్రం, మెడిటరేనియన్ సముద్రం నడుమ ఉండే దారే ఈ ఎర్ర సముద్రం. దీనికి ఒక చివరన సూయెజ్ జలసంధి ఉంటే.. మరో చివరన బాబ్ ఎల్-మండేబ్ జలసంధి. 30 కిలోమీటర్ల వెడల్పుండే ఈ బాబ్ ఎల్-మండేబ్ జలసంధిలోనే నిరుడు నవంబర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో హెలీక్యాప్టర్ నుంచి ఓ నౌకను హౌతీ తిరుగుబాటుదారులు హైజాక్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ మార్గం గుండా మార్స్క్, హపాగ్-లాయిడ్ వంటి అగ్రశ్రేణి షిప్పింగ్ కంపెనీలు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా ఆపేశాయి. మరికొన్ని సంస్థలు తమ కంటైనర్ల ధరల్ని బాగా పెంచి నడిపించే ధైర్యం చేస్తున్నాయి. ఈ పరిణామం యావత్తు ఆసియా-ఐరోపా ట్రేడింగ్‌ను ప్రభావితం చేస్తున్నదిప్పుడు. ప్రపంచ వాణిజ్యంలో ఈ మార్గం గుండా జరిగే ఎగుమతి-దిగుమతుల వాటా 12 శాతంగా ఉన్నది. నిజానికి మొదట్లో ఇజ్రాయెల్ నౌకలనే హౌతీ రెబల్స్ లక్ష్యంగా చేసుకున్నారు. కానీ ఆ తర్వాత అన్ని నౌకలపైనా క్షిపణులతో దాడులకు తెగబడుతున్నారు.

## హెచ్‌సీఎల్ అదుర్స్

న్యూఢిల్లీ, జనవరి 12: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.4,350 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది హెచ్‌సీఎల్ టెక్నాలజీ. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.4,096 కోట్ల లాభంతో పోలిస్తే 6.2 శాతం చొప్పున పెరిగింది. కన్సాలిడేటెడ్ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 6.5 శాతం ఎగబాకి రూ.26,700 కోట్ల నుంచి రూ.28,446 కోట్లకు చేరుకున్నది. గత త్రైమాసికంలో కొత్తగా 3,818 మంది ఫ్రెషర్లను నియమించుకోవడంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,24,756కి చేరుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధిలో 5 శాతం నుంచి 5.5 శాతం మధ్యలో ఉంటుందని అంచనావేస్తున్నది.

## భారీగా తగ్గిన ఫారెక్స్ రిజర్వులు

ముంబై, జనవరి 12: వరుసగా ఏడు వారాలుగా పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు కరిగిపోయాయి. ఈ నెల 5తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 5.90 బిలియన్ డాలర్లు తరిగిపోయి 617.30 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తరిగిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. గతవారాంతానికిగాను విదేశీ కరెన్సీ ఆస్తులు 4.97బిలియన్ డాలర్లుతగ్గి 546.65 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అలాగే పసిడి రిజర్వులు కూడా 839 మిలియన్ డాలర్లు తగ్గి 47.49 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

## హైదరాబాద్‌కు బోయింగ్ బీ777-9

హైదరాబాద్, జనవరి 12: ఈ నెల 18 నుంచి 21 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఎయిర్ షో 'వింగ్స్ ఇండియా 2024'కు బోయింగ్‌కు చెందిన 777-9 విమాన సర్వీసు రాబోతున్నది. ఇప్పటికే భారత్‌లో అడుగుపెట్టిన ఈ విమాన సర్వీసు హైదరాబాద్‌లో జరగనున్న విమాన షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు, ప్రపంచంలో ఇదే అతిపెద్ద విమానమని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 16న హైదరాబాద్‌కు రానున్న ఈ విమాన సర్వీసు 18, 19 తేదిలో ఎయిర్‌షోలో కొలువుదీరనున్నది.

## విప్రో లాభాల్లో క్షీణత

న్యూఢిల్లీ, జనవరి 12: దేశీయ ఐటీ దిగ్గజాల నిరాశాజనక ఫలితాలు కొనసాగుతున్నాయి. తాజాగా విప్రో నికర లాభం భారీగా పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.2,694.2 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,052.9 కోట్ల లాభంతో పోలిస్తే 11.74 శాతం తగ్గింది. రెండో త్రైమాసికంలో నమోదైన లాభంతో పోలిస్తే మాత్రం ఒక్క శాతం మేర పెరగడం విశేషం. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.23,229 కోట్ల రూ.22,205.1 కోట్లకు తగ్గింది. నికరంగా చూస్తే నాలుగు శాతం తగ్గినట్లైంది.

- ఐటీ సేవల నుంచి సంస్థకు రావాల్సిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4.5 శాతం తగ్గి రూ.23,196 కోట్ల నుంచి రూ.22,150.8 కోట్లకు పడిపోయింది.
- గత త్రైమాసికంలో సంస్థ 3.8 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నది. వీటిలో 0.9 బిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్ ఒక్కటే కావడం విశేషం.
- మార్చి త్రైమాసికంలో ఐటీ సేవల నుంచి 2,615 మిలియన్ డాలర్లు(రూ.21,845 కోట్లు) నుంచి 2,669 మిలియన్ డాలర్లు(రూ.22,296 కోట్లు) రావచ్చునని అంచనావేస్తున్నది.
- రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, బీమారంగాల్లో వృద్ధి మైనస్ 12.1 శాతం నమోదుకాగా, కన్జ్యూమర్ మైనస్ 6.9 శాతం, ఎనర్జీ, నేచురల్ రిసోర్స్, యుటిలిటీ మైనస్ 2.2, తయారీ మైనస్ 9.1 శాతం పడిపోయాయి.
- కానీ కమ్యూనికేషన్స్ విభాగంలో 18.8 శాతం వృద్ధి నమోదైంది.
- గత త్రైమాసికంలో 100 మిలియన్ డాలర్ల కంటే అధికంగా ఉన్న క్లయింట్లు సంఖ్య 22కి చేరుకున్నారు. గత త్రైమాసికంలో ఇది 19గా ఉన్నది.
- 75 మిలియన్ డాలర్ల కంటే విలువైన క్లయింట్ల సంఖ్య 29 నుంచి 31కి చేరారు.
- ప్రస్తుతం సంస్థ యాక్టివ్ క్లయింట్లు 1,349 ఉండగా, వీటిలో టాప్-10 సంస్థల వాటా 20 శాతానికి పైగా ఉన్నది.
- మూడో త్రైమాసికంలో కంపెనీలో వలసలు పది త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 12.3 శాతానికి పడిపోయాయి.

## హైదరాబాద్ ఇండ్లు భళా



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో నివాస గృహాల విక్రయాలు అంతకంతకు పెరుగుతున్నాయి. గడిచిన సంవత్సరం చివరి త్రైమాసికం(అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలం)లో నగరంలో 16,808 యూనిట్ల గృహాలు అమ్ముడయ్యాయి. వీటి విలువ రూ.9,497 కోట్ల స్థాయిలో ఉంటుందని స్కేర్ యార్డ్ వెల్లడించింది. దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో మార్కెట్ ఆశాజనకంగా ఉందని, సరసమైన ధరలతో పెట్టుబడి దారులు గృహాల కొనుగోలుకు ఆసక్తిచూపుతున్నారని వెల్లడించింది. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ముందుకు సాగిందని స్కేర్ యార్డ్ పార్టనర్ దేబయన్ భట్టాచార్య తెలిపారు.

# మార్కెట్ కిర్రాక్ షో

## ఆల్‌టైమ్ హై రికార్డులతో హోరెత్తించిన ఇండెక్స్‌లు

### మదుపరులను ఆకట్టుకున్న ఐటీ షేర్లు

### సెన్సెక్స్ 847, నిఫ్టీ 247 పాయింట్లు వృద్ధి

### రూ.373 లక్షల కోట్లకు మదుపరుల సంపద




*ఐటీ షేర్ల ర్యాలీతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను సంతరించుకున్నాయి.*

మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేయడంతో సూచీలు సరికొత్త స్థాయికి చేరాయి. ఆల్‌టైమ్ హై రికార్డుల్ని నెలకొల్పాయి.

*బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.373 లక్షల కోట్లను తాకింది. గత నాలుగు రోజుల్లోనే మదుపరుల సంపద దాదాపు రూ.7 లక్షల కోట్లదాకా ఎగిసింది మరి.*

| లాభాలకు ప్రధాన కారణాలు |
| --- |
| పెట్టుబడులకు ఆసక్తి కనబర్చిన మదుపరులు |
| ఐటీ షేర్లకు పెద్ద ఎత్తున డిమాండ్ |
| టెక్, రియల్టీ, చమురు రంగాల షేర్లూ ఆకర్షణీయం |
| డాలర్‌తో పోల్చితే పెరిగిన రూపీ విలువ |
| ఐరోపా, అమెరికా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు |

ముంబై, జనవరి 12: ఉదయం మొదలు.. మధ్యాహ్నం ముగిసేదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ శుక్రవారం అదిరిపోయింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 1 శాతానికిపైగా పుంజుకుని ఆల్‌టైమ్ హై రికార్డులతో హోరెత్తించాయి. మదుపరులను ఐటీ షేర్లు విపరీతంగా ఆకట్టుకున్నాయి. అంచనాలకు తగ్గట్టుగా టీసీఎస్, ఇన్ఫోసిస్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ఉండటంతో పెట్టుబడులు వెల్లువలా వచ్చిపడ్డాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 847.27 పాయింట్లు లేదా 1.18 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 72,568.45 వద్ద నిలిచింది. నిఫ్టీ సైతం 247.35 పాయింట్లు లేదా 1.14 శాతం ఎగబాకి 21,894.55 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 999.78 పాయింట్లు, నిఫ్టీ 281.05 పాయింట్లు పెరిగాయి. దీంతో నయా ఇంట్రా-డే హై రికార్డులు నమోదయ్యాయి. తొలిసారిగా అటు సెన్సెక్స్ 72,720.96 స్థాయికి, ఇటు నిఫ్టీ 21,928.25 స్థాయికి చేరాయి. ఇక ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 542.3 పాయింట్లు, నిఫ్టీ 183.75 పాయింట్లు పెరిగాయి.

**టీసీఎస్, ఇన్ఫోసిస్‌లకు జోష్**

శుక్రవారం జరిగిన స్టాక్స్ ర్యాలీలో టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు కీలకంగా నిలిచాయి. టీసీఎస్ షేర్ విలువ 3.89 శాతం పెరిగి బీఎస్ఈలో రూ.3,881.70 వద్దకు చేరింది. ఇంట్రా-డేలో 4.53 శాతం ఎగబాకి రూ.3,905.75ను తాకడం విశేషం. ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.53,239.2 కోట్లు ఎగిసి రూ.14,20,333.97 కోట్లకు వచ్చినట్టు తేలింది. ఇక ఇన్ఫోసిస్ షేర్ విలువ 7.84 శాతం పుంజుకుని రూ.1,612.20 వద్ద ఉన్నది. దీంతో సంస్థ మార్కెట్ విలువ రూ.48,652.73 కోట్లు పెరిగి రూ.6,69,135.15 కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో ఇరు సంస్థల ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలకు తగ్గట్టుగా ఉండటమే ఇందుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. క్యూ3లో టీసీఎస్ రూ.11,735 కోట్లు, ఇన్ఫోసిస్ రూ.6,106 కోట్ల లాభాల్ని అందుకున్నది తెలిసిందే.

**గ్లోబల్ మార్కెట్లలో..**

అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ఆసియా ప్రధాన మార్కెట్లలో జపాన్ లాభాల్లో ముగిసింది. దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. అయితే ఐరోపా మార్కెట్లలో కీలకమైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలు లాభాల్లోనే కదలాడుతున్నాయి. అమెరికా మార్కెట్లు కూడా గురువారం లాభాల్లోనే ముగిశాయి. ఇదిలావుంటే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.41 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.36 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాలవారీగా ఐటీ అత్యధికంగా 5.06 శాతం, టెక్నాలజీ 4.40 శాతం, రియల్టీ 1.93 శాతం, చమురు-గ్యాస్ 1.71 శాతం, ఎనర్జీ 1.09 శాతం, టెలికం 0.77 శాతం పెరిగాయి.

### *ఒక్కరోజే రూ.2.76 లక్షల కోట్లు వృద్ధి*


*మదుపరులు పెట్టుబడుల దిశగా పరుగులు పెట్టడంతో ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.2.76 లక్షల కోట్లు ఎగిసింది. అంతకుముందు మూడు రోజులూ సూచీలు లాభాల్లోనే ముగియడంతో ఈ నాలుగు రోజుల్లో మదుపరుల సంపద రూ.6,88,711.19 కోట్లు ఎగబాకినట్టైంది. దీంతో ప్రస్తుతం బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.3,73,29,676.27 కోట్లకు చేరింది. ఈ వారంలో సోమవారం మినహా మిగతా నాలుగు రోజులు సూచీలు లాభాలనే అందుకున్నాయి. అయితే సోమవారం భారీ నష్టాలనే మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 671, నిఫ్టీ 198 పాయింట్లు క్షీణించాయి. ఈ ఏడాది మొదలు ఇదే అత్యధికం కావడం గమనార్హం.*



# కన్నీళ్లొస్తున్నాయ్..

### 4 నెలల గరిష్ఠానికి ధరల సూచీ

### డిసెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.69 శాతం



*మళ్లీ కొండెక్కిన కూరగాయలు వినియోగ ధరల సూచీలో ప్రధాన భాగమైన ఆహార పదార్థాల ధరలు 2023 డిసెంబర్‌లో అంతక్రితం ఏడాది ఇదేనెలతో పోలిస్తే 9.53 శాతం పెరిగాయి. నవంబర్ నెలలో మొత్తంగా ఆహారోత్పత్తుల పెరుగుదల 8.7 శాతంకాగా, 2022 డిసెంబర్‌లో 4.9 శాతం. సమీక్షా నెలలో ఫుడ్ బాస్కెట్‌లోని కూరగాయల ధరలు భారీగా 27.64 శాతం ఎగిసాయి. పప్పు దినుసుల ధరలు 20.73 శాతం, మసాలా దినుసుల ధరలు 19.69 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు వంటనూనెల ద్రవ్యోల్బణం మాత్రం 14.96 శాతం తగ్గింది.*

న్యూఢిల్లీ, జనవరి 12: కొద్దికాలంపాటు ధరలు తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. 2023 డిసెంబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల గరిష్ఠానికి చేరింది. ప్రధానంగా ఆహారోత్పత్తుల ధరలు పెరుగుదల ఇందుకు కారణం. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారంగా లెక్కించే రిటైల్ ద్రవ్యోల్బణం నవంబర్ నెలలో 5.55 శాతంకాగా, 2022లో ఇదే నెలలో ఇది 5.72 శాతం. 2023 ఆగస్టు నెలలో 6.83 శాతానికి పెరిగిన తర్వాత మళ్లీ ఇంత గరిష్ఠస్థాయిలో నమోదుకావడం డిసెంబర్ నెలలోనే. జాతీయ గణాంకాల శాఖ శుక్రవారం విడుదల చేసిన వివరాల ప్రకారం పట్టణ ప్రాంతాలకంటే గ్రామాల్లో అధికంగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో 5.93 శాతం, పట్టణాల్లో 5.56 శాతం చొప్పున ధరలు పెరిగాయి. వడ్డీ రేట్లను రిజర్వ్‌బ్యాంక్ తగ్గించాలంటే రిటైల్ ద్రవ్యోల్బణం నిర్దేశిత 2-4 శాతం శ్రేణిలోకి దిగిరావాల్సి ఉన్నది.

## క్యాపెక్స్‌లో భారీ కోత

- **30% నుంచి 10 శాతానికి తగ్గుదల**
- **గోల్డ్‌మాన్ శాక్స్ రిపోర్ట్**

న్యూఢిల్లీ, జనవరి 12: ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే మూలధన వ్యయాల (క్యాపెక్స్)పై గత మూడేండ్లుగా చూపిస్తున్న జోరును వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం బాగా తగ్గించుకుంటుందని అంచనా వేస్తున్నారు. మౌలిక ప్రాజెక్టుల్లో పెట్టుబడుల్ని పెంచడం ద్వారా ఉపాధి కల్పన, ఆర్థిక వ్యవస్థకు ఉద్దీపన కలిగించేందుకు ఉద్దేశించిన ఈ మూలధన వ్యయాల్ని గత మూడేండ్లుగా కేంద్రం 30 శాతం చొప్పున పెంచుతూ వచ్చింది. అయితే 2024-25లో ఈ పెంపుదల 10 శాతానికి పడిపోతుందని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మాన్ శాక్స్ తెలిపింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్‌పై రిపోర్ట్ విడుదల చేసింది. మూడేండ్లుగా బడ్జెట్లో క్యాపెక్స్‌కు జీడీపీలో 3.3 శాతం చొప్పున కేటాయింపులు జరుపుతున్నారని, అయితే ద్రవ్యలోటును 5.2-5.4 శాతానికి అదుపుచేయాలన్న లక్ష్యంతో 2024-25లో మూలధన వ్యయాల్లో పెంపుదల 10 శాతానికే పరిమితమవుతుందని ఎకానమిస్టులు అంచనా వేస్తున్నారు. 5.9 శాతం నిర్దేశిత ద్రవ్యలోటు లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించవచ్చని తెలిపారు. 2023-24లో సబ్సిడీలపై వ్యయాలు జీడీపీలో 1.6 శాతంకాగా, 2024-25లో ఇవి 1.4 శాతానికి దిగివస్తాయని పేర్కొన్నారు. కానీ సహజవాయువు ధరలు పెరిగిందున ఎరువులపై సబ్సిడీ భాగం పెరగవచ్చని అంచనా వేశారు.

## పడకేసిన పారిశ్రామికం

### 8 నెలల కనిష్ఠస్థాయికి వృద్ధి

న్యూఢిల్లీ, జనవరి 12: సర్వీసుల రంగం దేశీయ ఆర్థికాభివృద్ధికి ఊతంగా నిలుస్తున్నప్పటికీ, పారిశ్రామిక రంగం నానాటికీ కుంచించుకుపోతున్నది. 2023 నవంబర్ నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ 2.4 శాతం మాత్రమే వృద్ధి కనపర్చినట్టు జాతీయ గణాంకాల శాఖ తెలిపింది. ఈ వృద్ధి రేటు 8 నెలల కనిష్ఠం. 2022 నవంబర్‌లో 7.6 శాతంగా నమోదైన పారిశ్రామికోత్పత్తి వృద్ధి ఏడాది తిరిగే సరికల్లా 2.4 శాతానికి పడిపోయింది. 2023 మార్చి తర్వాత ఇంత కనిష్ఠానికి క్షీణించడం ఇదే ప్రథమం.

## ఎంజీ నయా ఆస్టర్

### ప్రారంభ ధర రూ.9.98 లక్షలు

న్యూఢిల్లీ, జనవరి 12: బ్రిటన్‌కు చెందిన ఎంజీ..దేశీయ మార్కెట్లోకి నయా అస్టర్ 2024 మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.9.98 లక్షలు. వైర్‌లెస్ చార్జర్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో అండ్ యాపిల్ కార్ ప్లే, ఐ-స్మార్ట్ 2.0, వాయిస్ కమాండ్ వంటి ఫీచర్‌తో తయారు చేసింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.